ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
బుధవారం | జులై 08, 2026 | సంపుటి : 7 | సంచిక : 35 | పేజీలు : 2

బొగతను పర్యాటక క్షేత్రంగా
## తీర్చిదిద్దాలి

- కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు
- అధికారులతో సమీక్ష


2 లో







## భగ్గుమన్న మంత్రి సురేఖ

**ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య రాజకీయ చిచ్చు రగులుతూనే ఉంది. మంత్రి కొండా సురేఖకు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు అంతర్గత యుద్ధం కొనసాగుతూనే ఉంది. తాజాగా మంత్రి కొండా సురేఖకు లేకుండానే స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించడం పట్ల మంత్రి సురేఖ భగ్గుమన్నారు. కడియం శ్రీహరి తన పరిధిని దాటి వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.**

- తన పరిధి దాటి వ్యవహరించారని వ్యాఖ్య
- సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు
- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుపై మంత్రి సీరియస్

### సమీక్షతో వివాదం

హైదరాబాద్ లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడికల్, నవాబ్ పేట, చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, మల్లికుదుర్ల ఆలయాల అభివృద్ధి పై కమిషనర్ హనుమంత రావు తో కలిసి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్లు, ఈఈ, ఈవో లతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆలయాల సమగ్ర అభివృద్ధికి వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. ఇందుకు ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. దేవాలయాల భూముల ఆక్రమణలు తొలగించి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెల రోజులలో ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పూర్తి స్థాయి సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


Smt. Konda Surekha
Minister For Environment, Forest & Endowments
Government of Telangana

తేది: 07.07.2026

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారికి,

### మంత్రి సురేఖ ఫైర్

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారశైలిపై దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, దేవాదాయశాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించడం పై సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. కడియం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలు, మంత్రిగా తన అధికార పరిధిని బేఖాతరు చేశారని మంత్రి సురేఖ లేఖలో పేర్కొన్నారు.
మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదు లేఖలో, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ తదితర అంశాలు సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ, శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరక్టర్ తో పాటు శాఖ అధికారులను సమావేశపరచి పలు దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, (మిగతా 2 లో..)



సింగరేణి చేతికి తాడిచర్ల-2
## బొగ్గు గనులు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ఢిల్లీ, ఆయుధం:** తాడిచర్ల 2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 4050 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. "ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 3035 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల 2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## కేసీఆర్ మనవడు హిమాన్షు కు గాయం

- ఏఐజీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న హిమాన్షు
- మనవడిని పరామర్శించిన కేసీఆర్
- కుమారుడు హిమాన్షు ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్ ట్వీట్



**హైదరాబాద్, ఆయుధం**: మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ కుమారుడు కల్వకుంట్ల హిమాన్షుకు స్వల్ప గాయం అయింది. సోమవారం ఆటలాడుతుండగా అతడి ముక్కుకు చిన్న గాయమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఏఐజీ ఆస్పత్రి చేరుకున్నారు. సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరి కేసీఆర్ కూడా ఆస్పత్రికి వచ్చారు. మనవడిని పరామర్శించిన అనంతరం అతడి ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.
మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్షు ఎక్స్ వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయమవ్వడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశాంత్రి తీసుకోవాలని డాక్టర్లు సూచించినట్లు హిమాన్షు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదిగా స్పందిస్తూ సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని తెలిపారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతుందని, కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని వివరించారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.



కుడా ల్యాండ్ పూలింగ్ స్కీంలో
## ముందడుగు

- వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్స్ పరిధిలోని 30 ఎకరాల భూమి అప్పగింత

**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ప్రక్రియలో భాగంగా వరంగల్, హనుమకొండ నగరాల పరిధిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హనుమకొండ వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్స్ పరిసర ప్రాంతాల్లోని భూములను అభివృద్ధి చేసేందుకు భూ యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్స్ భూ యజమానుల కమిటీ సభ్యులు, ప్రతినిధులైన బూర విద్యాసాగర్, ఎం.విజయ్ కుమార్, డి.స్వరాజ్యలక్ష్మి, బూర అశోక్ కుమార్, బల్లెం వెంకటయ్య, రాజేష్, తిరుపతి రెడ్డిలు సంయుక్తంగా కుడా కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్స్ పరిధిలోని సుమారు 30 ఎకరాల విలువైన భూమిని ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల ప్రకారం కుడా ఆధ్వర్యంలో లేఅవుట్ అభివృద్ధి చేయడానికి యజమానులు సంపూర్ణ అంగీకారం తెలిపారు. ఇందుకు సంబంధించిన అధికారిక అప్లికేషన్లు, భూమి హక్కుల పత్రాలు, అవసరమైన అన్ని డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలను అధికారికంగా సమర్పించారు. చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. నగర సుందరీకరణ, క్రమబద్ధమైన పట్టణాభివృద్ధికి ల్యాండ్ పూలింగ్ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు గానూ, రాబోయే 4 రోజుల్లో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

గురుకుల విద్యార్థినుల భద్రత, వసతుల
## కల్పనకు ప్రాధాన్యత

- మడికొండ బాలికల గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.28 లక్షలు మంజూరు
- ఎమ్మెల్యే నాగరాజు
- వేతనం నుంచి రూ.2.50 లక్షల విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే

**హనుమకొండ, ఆయుధం:** మడికొండ లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల భద్రత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పలు అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరు చేసినట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు తెలిపారు. అదేవిధంగా తన ఒక నెల వేతనం నుంచి రూ.2.50 లక్షలను పాఠశాల అభివృద్ధికి విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఎమ్మెల్యే కే.నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి మడికొండ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల విద్యార్థిని కుక్క కాటుకు గురైన ఘటన నేపథ్యంలో అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థినుల భద్రతకు చేపట్టాల్సిన చర్యల పై అధికారులకు పలు సూచనలు చేశారు.
పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతున్నదా అని ఆరా తీశారు.
పాఠశాల ప్రహరీ గోడపై రింగ్ చైన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా కుక్కల ప్రవేశాన్ని అరికట్టాలని సూచించారు. భవనానికి ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు ఆవరణలో తగినంత విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు కిటికీలకు దోమతెరలు ఏర్పాటు చేయాలని, ఇతర మరమ్మతు పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.



పాఠశాల ఆవరణలోని ముళ్లపొదలను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు మున్సిపల్ శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మెనూ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు. పాఠశాలలో లైటింగ్ సదుపాయం, 20 సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాటుకు తన ఒక నెల వేతనం నుంచి రూ.2.50 లక్షలు అందజేస్తానని ప్రకటించారు. అదేవిధంగా విద్యార్థినులకు అవసరమైన డబుల్ డెక్కర్ పడకల ఏర్పాటు కోసం కూడా కృషి చేస్తానని.. (మిగతా 2 లో..)

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

- పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత,

**వరంగల్, ఆయుధం:** పోలీసులు తమ విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవడం ఎంతో కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను మంగళవారం పోలీస్ కమిషనర్ మామునూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో ప్రారంభించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది డ్యూటీ మీట్ లో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్, హ్యాండ్లింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ & వీడియోగ్రఫీ వంటి విభాగాల్లో




సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబర్చిన వారిని, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కోసం ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలు కూడా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలోనే నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ లు అధికారులకు తమ నైపుణ్యాలను మెరుగుపర్చే అవకాశం కల్పిస్తాయి. నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీ లు బాలస్వామి, శ్రీనివాస్, జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## జీపీలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను అమలు చేయాలి
- సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల సమగ్ర శిక్షణ ప్రారంభం
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)

**హనుమకొండ, ఆయుధం:** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనాపరంగా మరింత బలోపేతం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ సైదుల్ రెడ్డి, జిల్లా పరిషత్ అదనపు ప్రధాన కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీ ప్రసన్న, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్ రామాంజనేయులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామం తన అవసరాలను గుర్తించి, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని సమగ్ర ప్రణాళికలు రూపొందించేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలన్నారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రతి సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి పూర్తి అవగాహన కల్పించాలని, గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలను నిర్ణయించి పనులు చేపట్టాలని సూచించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జిల్లాల వారీగా సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు మూడు రోజుల సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

# బొగతను ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- **ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా సంప్రదాయ వంటకాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచాలి**
- **జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, ఆయుధం:** వాజేడు మండలంలోని బొగత జలపాతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తూ పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని,స్థానిక సాంప్రదాయ వంటకాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచే విధంగా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా బోర్కడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్ లో వాజేడు మండలంలోని బొగత జలపాతం అభివృద్ధి, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ నిర్వహణ, స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బొగత జలపాతాన్ని సందర్శించే పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేలా పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్, విశ్రాంతి సౌకర్యాలు, భద్రత, దిశా నిర్దేశక బోర్డులు తదితర అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు స్థానిక సంస్కృతి, సంప్రదాయ ఆహార రుచులను పరిచయం చేసేలా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా జొన్న రొట్టె, బాంబూ చికెన్, నాటుకోడి, చేపల వంటకాలు, తదితర సాంప్రదాయ వంటకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధితో పాటు ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు. పర్యాటక ప్రాంతంలో స్థానిక ప్రత్యేకతను ప్రతిబింబించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం కల్పిస్తూ, వచ్చే ప్రతి పర్యాటకుడికి నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని బొగత జలపాతాన్ని రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనా, టూరిజం అధికారి శివాజీ, అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల విద్యార్థినుల భద్రత, వసతుల

# కల్పనకు ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి..)

హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, పాఠశాల ప్రహరీ గోడపై రింగ్ చైన్ ఫెన్సింగ్‌ను మున్సిపల్ శాఖ ద్వారా వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రత విషయంలో రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన కుక్క కాటు ఘటనపై సమాచారం వెంటనే అందించకపోవడంపై కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోతిపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యతో పాటు విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాసంస్థ ప్రాంతీయ సమన్వయ అధికారి అరుణకుమారి, ఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజనీర్ నరేందర్ రెడ్డి, సహాయ ఇంజనీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, బల్దియా ఎస్ ఈ రాజ్ కుమార్, ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట తహసీల్దార్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రేటర్ వరంగల్ పారిశుద్ధ్య నిర్వహణకు

# అంతర్జాతీయ ప్రశంసలు

- **నగర మలశుద్ధీకరణ విధానాలను పరిశీలించిన ఎడిబిఐ జపాన్ కన్సల్టెంట్**
- **జిల్లా కలెక్టర్, జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్, బల్దియా కమిషనర్ వెంకన్నతో సమావేశం**

**హనుమకొండ, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ నగరంలో అమలు చేస్తున్న మలశుద్ధీకరణ, మల విసర్జన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ విధానాలను ఆసియా అభివృద్ధి బ్యాంకు సంస్థ (ఏడీబీఐ) జపాన్ కన్సల్టెంట్ డాక్టర్ కజుషి హషిమోటో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రశంసించారు. ముందుగా ప్రతినిధుల బృందం అమ్మవారిపేటలో ఏర్పాటు చేసిన రోజుకు 15 కిలోలీటర్లు, 150 కిలోలీటర్ల సామర్థ్యం గల మలశుద్ధీకరణ కేంద్రాలను సందర్శించి, అక్కడ అమలవుతున్న శుద్ధీకరణ ప్రక్రియ, నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థపై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్, బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, నగరంలో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సుస్థిర పారిశుద్ధ్య విధానాలను ప్రోత్సహించే క్రమంలో జీడబ్ల్యూఎంసీ, ఆస్కీ సంస్థల సహకారంతో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా అమ్మవారిపేటలో రోజుకు 15 కిలోలీటర్ల సామర్థ్యంతో మలశుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పైరోలసిస్ విధానం ద్వారా మలాన్ని సేంద్రీయ ఎరువుగా మార్చి వ్యవసాయ భూముల్లో వినియోగిస్తున్నామని తెలిపారు. శుద్ధి చేసిన నీటిని రహదారి మధ్య విభజన ప్రాంతాల్లోని మొక్కలకు వినియోగిస్తున్నామని వివరించారు. నగర అవసరాలకు అనుగుణంగా ఇటీవల రోజుకు 150 కిలోలీటర్ల సామర్థ్యం గల ఆధునిక మలశుద్ధీకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో అమలవుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాలు, మలశుద్ధీకరణ సాంకేతికత, వనరుల పునర్వినియోగ విధానం ఆదర్శప్రాయంగా ఉన్నాయని డాక్టర్ కజుషి హషిమోటో ప్రశంసించారు. ఈ తరహా సుస్థిర పారిశుద్ధ్య నమూనాలు ఇతర పట్టణాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో సీఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి, ఈఈలు మహేందర్, స్పందన, ఆస్కీ ప్రతినిధులు డా.స్నేహలత, రాజ్ మోహన్ రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- **వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి**

**వేలేరు, ఆయుధం:** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా వైద్యాధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని వేలేరు మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు, వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి సూచించారు. మంగళవారం వేలేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘన అధ్యక్షతన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అనారోగ్యాంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ హాస్పటల్లో సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్పటల్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, దోమల నివారణ కోసం గ్రామ పంచాయతీ తరపున ప్రత్యేకమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మండల కేంద్రంలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయని స్థల సేకరణ కూడా జరిగిందని చెప్పారు. త్వరలో శంకుస్థాపన చేస్తామని సర్పంచ్ తెలిపారు.

ఈ సమావేశంలో ఉప సర్పంచ్ శ్రీకర్, మెడికల్ ఆఫీసర్ నవీన్, డాక్టర్ వైశాలి, HEOs వెంకటేశ్వర్లు, కుమారస్వామి, ప్రభావతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత, వేగం పెంచాలి

- **వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, జంతు సంరక్షణ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న**



**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, జంతు జనాభా నియంత్రణ కార్యక్రమాల పురోగతిని బల్దియా కమిషనర్ టి. వెంకన్న మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా బాలసముద్రంలోని బయో కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, కోకోపీట్, జీవ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రం, పొడి వ్యర్థాల వేరు చేసే కేంద్రాలను సందర్శించిన కమిషనర్, అక్కడ అమలవుతున్న ప్రక్రియలను పరిశీలించి నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తూ పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం హసన్‌పర్తిలోని జంతు జనాభా నియంత్రణ (ఏబీసీ) కేంద్రాన్ని సందర్శించి వీధి కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు, చికిత్సా విధానాలు, సంరక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కేంద్రానికి అనుబంధంగా నిర్మిస్తున్న నూతన కేంద్రాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, వారం రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తదుపరి మడికొండలోని డంపింగ్ యార్డును సందర్శించిన కమిషనర్, బయోమైనింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత మేర బయోమైనింగ్ ద్వారా పాత వ్యర్థాల తొలగింపు పూర్తయిందో అధికారులను అడిగి తెలుసుకుని, నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా పదార్థాల పునర్వినియోగ కేంద్రం (ఎం ఆర్ ఎఫ్), సంపీడిత బయోగ్యాస్ ప్లాంటు (సిబిజి) ఏర్పాటుకు స్థలం గుర్తించిన నేపథ్యంలో, వెంటనే పనుల ప్రణాళిక రూపొందించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత, వేగం, శాస్త్రీయ విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందేలా అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ టి.వెంకన్న అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ మహేందర్, జీడబ్ల్యూఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గానికి

# అభినందనలు

**వరంగల్, ఆయుధం:** వజ్ర శతరంజి చేనేత సహకార సంఘం, ఆటోనగర్ కొత్తవాడ నూతన కార్యవర్గానికి టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం జరిగిన వజ్ర శతరంజి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. అధ్యక్షురాలిగా వావిలాల భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు వావిలాల సదానందం, కోశాధికారిగా బండారి రమేష్, డైరెక్టర్లుగా ఉడుత సమ్మయ్య, వావిలాల వసంత్, బండారి రమేష్, మార్త రమేష్, కూచన భిక్షపతి, బూర మాణెమ్మ ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరూ సంఘ అభివృద్ధికి కృషి చేసి, సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ విజయవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# అయోధ్య కానుకల చోరీపై సీబీఐ విచారణ జరపాలి

- **కానుకల చోరీపై బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలి**
- **సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**
- **సీపీఐ ఆధ్వర్యంలో తొర్రూర్ లో రాస్తారోకో**




**తొర్రూర్, ఆయుధం:** అయోధ్య రామ మందిరం కానుకల చోరీపై వెంటనే సీబీఐ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ లో రామ మందిరం కానుకల చోరీపై సీబీఐ విచారణ జరుపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అయోధ్య రామ మందిరంలో పెద్ద ఎత్తున రామ భక్తుల కానుకల చోరీ జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, కుంభకోణం బయట పడినా నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. దేవాలయములో దోపిడీకి బిజెపి బాధ్యత వహించాలన్నారు. హిందూత్వం పేరు చెప్పి ఆలయ సంపద దోపిడీ చేశారని, బీజేపీ నాయకులు దీనిపై సమాధానము చెప్పాలని డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో బీజేపీ నాయకుల గుడి దోపిడీ చూస్తే భక్తుల గుండె తరుక్కుపోతుందని, దేవాలయాలకి బీజేపీ తీరని అన్యాయం చేస్తున్నదని అన్నారు. గుడి లో ఉన్న దేవుడికి కూడా రక్షణ లేదని, బీజేపీ దోపిడీ చూసి దేవుడు కూడా వణికిపోతున్నాడని అన్నారు. హిందుత్వం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీ చేతిలో దేవాలయాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ఆలయాల పవిత్రతకు భంగం కలుగుతున్నదని, బీజేపీ తీరుతో భక్తుల గుండెల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నదని అన్నారు. దేవుడి సొమ్ము దేవుడికే దక్కాలని, బీజేపీ దోపిడీని అడ్డుకుని ఆలయాలను కాపాడుకోవాలన్నారు. దేవాలయాల సంపదను దోచుకుంటున్న బీజేపీతో హిందూ ధర్మానికి పెద్ద ప్రమాదం ఏర్పడిందని, గుడిలో దోపిడీతో ఆ పవిత్రతకు భంగం కలిగిందని అన్నారు. రామ మందిరం విషయములో బీజేపీ తీరుతో భక్తుల విశ్వాసం దెబ్బతిన్నదని అన్నారు. దేవుడి ఆస్తి దేవుడికే చెందాలని, బీజేపీ దోపిడీని సహించరాదని, బీజేపీ నాయకులు చేసిన ఆలయ దోపిడీని ఖండిస్తున్నామని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, సిపిఐ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్ సారధి రెడ్డి, నన్ను సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఐ నేతలు ఓమ బిక్షపతి, మహేందర్, కిరణ్, లక్ష్మణ్, పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, పాండురంగ చారి, వెంకన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.




## వైద్య చదువు నిమిత్తం

# దేహ దానం

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ బీమారం వృద్ధ ఆశ్రమం నివాసి దేశెట్టి లాలయ్య(85) మంగళవారం మరణించగా, ఆశ్రమ నిర్వాహకులు నరేష్ గౌడ్ సమాజ హితం కోరి, వైద్య విద్యా నిమిత్తం, మెడికల్ కాలేజీకి దేహదానం చేయుటకు అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ దాస్, అనాటమీ విభాగపతి డాక్టర్ శశికాంతా, వారి అనాటమీ సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ కు అప్పగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ గారు మాట్లాడుతూ... “” నిశబ్ద గురువు పార్థీవ దేహం “”దేహ దానంతో బావి వైద్యులు శస్త్ర చికిత్సలను,శాస్త్ర పరిశోధనలను, వైద్య విద్యను నేర్చుకుంటారని అన్నారు. దేహ దానం చేసిన నిర్వాహకులకు, అసోసియేషన్ ప్రతినిధులకు ధన్యవాదములు తెలిపారు. వివరాలకు 8790548706, 9490133650 నంబర్స్ ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పద్మ, ప్రధాన కార్య దర్శి ఆడెపు రాజేంద్ర ప్రసాద్, హనంకొండ ఉపాధ్యక్షులు కదారి శ్రీనివాస్, అడ్వకేట్ పావని పాల్గొన్నారు.

# కడియం వర్సెస్ కొండా

(మొదటి పేజీ తరువాయి..)

మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా పరంగా అభ్యంతరకరమని, రూల్స్ ఆఫ్ బిజినెస్ స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు.

### కడియంపై చర్యలు తీసుకోండి

శాఖా పరిపాలనకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు సంబంధిత శాఖా మంత్రి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుందనే విషయం ప్రజా జీవితంలో అనుభవజ్ఞులైన ప్రతి ప్రజాప్రతినిధికి విదితమేనని మంత్రి సురేఖ పేర్కొన్నారు.అలాంటి పరిస్థితుల్లో శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టి అధికారిక సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని మంత్రి తన లేఖలో స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీయడమే కాకుండా అధికార యంత్రాంగంలో అయోమయ పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై వివరణ కోరడంతో పాటు, పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి తన ఫిర్యాదులో కోరారు. అంతేకాకుండా కడియం శ్రీహరి వ్యవహార శైలిపై ఇప్పటికే పార్టీ హైకమాండ్ కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు.

### దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుపై మంత్రి ఆగ్రహం..

సోమవారం ఆబిడ్స్ లోని ఎండోమెంట్ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో రివ్యూ చేయడం పట్ల ఆ శాఖ కమిషనర్ హనుమంతరావుపై మంత్రి సురేఖ సీరియస్ అయ్యారు. ఫోన్ చేసి గట్టిగా మందలించారు. అంతేకాకుండా కమిషనర్ హనుమంతరావుపై సిఎం రేవంత్ రెడ్డి, సిఎస్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

# సాయికృష్ణ మృతి కేసు

- **సీఐని కృష్ణలంకలో విచారించేందుకు హైకోర్టు అనుమతి**

**అమరావతి, ఆయుధం:** విజయవాడకు చెందిన సాయికృష్ణ మృతి కేసులో సీఐ నాగరాజు కస్టడీ నిబంధన సడలింపు పిటిషన్‌పై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అతడిని కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో విచారించేందుకు అనుమతించింది. ఈ నెల 9 నుంచి ఎనిమిది రోజుల పాటు విచారించేందుకు అంగీకరించింది. నాగరాజును రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో విచారించాలని ఇటీవల విజయవాడ కోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలో విజయవాడ కోర్టు విధించిన నిబంధనలు సడలించాలని సిట్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నాగరాజును కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో విచారించేందుకు అనుమతిచ్చింది.

# ప్రముఖ కవయిత్రి వనపర్తి పద్మావతి శరీరదానానికి అంగీకారం




**వరంగల్, ఆయుధం:** ప్రముఖ కవయిత్రి, సామాజిక సేవకురాలు వనపర్తి పద్మావతి తన మరణానంతరం దేహాన్ని వైద్య విద్యార్థుల వైద్య విద్య, పరిశోధనల కోసం కాకతీయ మెడికల్ కళాశాలకు దానం చేయడానికి అంగీకరించారు. ఈ మేరకు శరీరదానానికి సంబంధించిన సమ్మతి పత్రాలపై ఆమె భర్త, విశ్రాంత తహసీల్దార్ చంద్రశేఖర్, కుమార్తె ప్రజ్వల, కుమారులు ప్రవీణ్, ప్రణీత్ సంతకాలు చేసి, నేడు కాకతీయ మెడికల్ కళాశాల అధికారులకు రెడ్ క్రాస్ సొసైటీలోని డేకేర్ సెంటర్ లో అందజేశారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, వరంగల్ మహిళలు, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కూరాకుల భారతి, ప్రధాన కార్యదర్శి టి. నిర్మల, కోశాధికారి జె. విజయలక్ష్మి, భారతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మరణానంతరం శరీరదానం, అవయవదానం ద్వారా వైద్య విద్యాభివృద్ధికి, అనేక మంది ప్రాణాలను కాపాడటానికి విశేషమైన సేవ చేయవచ్చని పేర్కొన్నారు. శరీరదానం చేయడానికి ముందుకు వచ్చిన శ్రీమతి వనపర్తి పద్మావతిని వారు హృదయపూర్వకంగా అభినందించి, ఆమె నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమని ప్రశంసించారు. వనపర్తి పద్మావతిని ఘనంగా సన్మానించి, ఆమె సేవా భావాన్ని ప్రశంసించారు. శరీరదానం వంటి మహోన్నత నిర్ణయాలు సమాజంలో మరింత అవగాహన పెంచి, మరెందరో ఈ దిశగా ముందుకు రావడానికి ప్రేరణ కలిగిస్తాయని వారు పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695